## క్లుప్తంగా

### గరుడ వాహనంపై ఆదికేశవస్వామి



గరుడ వాహనంపై ఊరేగుతున్న ఆదికేశవస్వామి

నరసాపురం: పట్టణంలోని ప్రసిద్ధ ఆదికేశవ ఎంబేరుమానార్ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడ వాహనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో కీలకమైన ఘట్టం కావడంతో గరుడ వాహనంపై వీధుల్లో ఊరేగిన శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవస్వామిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు కిడాంబి వెంకటార్యులు, ప్రధానార్చకుడు పెద్దింటి మోహన రామాచార్యులు, ఆలయ చైర్మన్ పుప్పాల వెంకటకృష్ణారావు, ఈఓ ఆర్‌వీవీఎస్ రామచంద్రరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### అగ్ని ప్రమాదాలపై అవగాహన



బస్టాండ్‌లో డెమో ద్వారా అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండవరోజు పట్టణంలో కరపత్రాలను అందజేశారు. అలాగే బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ప్రజలకు ఫైర్ ప్రమాదాల నుంచి ఎలా రక్షించుకోవాలి? ఎలా స్పందించాలో? డెమో ద్వారా ప్రజలకు, ప్రయాణికులకు విన్యాసాలు చేసి చూపించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ఇళ్లల్లో, వ్యాపార సంస్థల్లో, ఫ్యాక్టరీల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కరపత్రాల ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వై.వి జానకిరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టంపై అవగాహనతో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్

యలమంచిలి: దేశంలోని ప్రతి పౌరుడూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్ కుమార్ కోరారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దేశ భద్రతకు, పౌర స్వేచ్ఛకు ఆటంకం లేకుండా ఏ సమాచారమైన ఈ చట్టం ద్వారా తెలుసుకునే అవకాశం ప్రజలకు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ పూడి దేవిడ్సన్, ఆర్ఐ కవురు యశోద పాల్గొన్నారు.

### ఇద్దరికి కందుకూరి విశిష్ట పురస్కారం



మానాపురం సత్యనారాయణ



అంబటి పెద వెంకట రాజు

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన ఇద్దరు కళాకారులు కందుకూరి విశిష్ట పురస్కారానికి ఎంపికయ్యారు. పాలకొల్లు కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి, రంగస్థల నటుడు మానాపురం సత్యనారాయణ, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, పాలకొల్లు గద్దర్ అంబటి పెద వెంకటరాజులను ఎంపిక చేశారు. ఏప్రిల్ 16 కందుకూరు వీరేశలింగం జయంతి పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఈ పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. ఇద్దరి కి ఈ పురస్కారం రావడంపై పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షులు కె.వి కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాసుర, డాక్టర్ కెఎస్‌పిఎన్ వర్మ, విటాకుల రమణ, జక్కంపూడి కుమార్, కొనిజేటి గుప్త, దాసరి నాని తదితరులు అభినందనలు తెలియజేశారు.

### పెట్రోల్ బంకులో తనిఖీలు

కాళ్ల: స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకులో జిల్లా అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. సోమవారం పెట్రోల్ బంక్‌లో జరిగిన మోసాలపై వినియోగదారులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అధికారులు స్పందించి, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ వివి నాగరాజారావు, ఏఎస్‌ఓ ఎం.రవిశంకర్ లు బంకులోని రికార్డులను, పెట్రోల్ నాణ్యతను తదితర అంశాలను క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నివేదికను జిల్లా అధికారులకు సమర్పిస్తామని పేర్కొన్నారు. వీరి వెంట ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్వో శివనాగరాజు ఉన్నారు.

# పాలకొల్లులో గ్రామ దేవతల ఉత్సవాల సందడి

- ఉత్సవాల నిర్వహణలో వినూత్న సంప్రదాయం
- 15 రోజులకు ఓ ఆలయంలో ఉత్సవాలు



శ్రీ కనకదుర్గమ్మ



శ్రీ మావుళ్లమ్మ



శ్రీ ముఖదారమ్మ



శ్రీ మావూరమ్మ



శ్రీ పెద్దింట్లమ్మ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ వస్తుందంటే చాలు గ్రామదేవతల ఉత్సవాల సందడి ప్రారంభం అవుతుంది. ఒక్కో అమ్మవారికి ఒక్కో రోజున ఉత్సవ కమిటీ సభ్యులు తమ శక్తి కొద్దీ ఉత్సవాలను భారీ స్థాయిలో నిర్వహిస్తుంటారు. అలా పాలకొల్లు పట్టణంలో గ్రామ దేవతగా శ్రీ మావుళ్లమ్మ విరాజిల్లుతుండగా ఆమె తోబుట్టువులుగా శ్రీ ముఖధారమ్మ, శ్రీ మావూరమ్మ, శ్రీ పెద్దింట్లమ్మ, శ్రీ పుంతలోముసలమ్మ, శ్రీ కొండాలమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ దేశాలమ్మ, శ్రీ మావుళ్లమ్మలు పట్టణంలో కొలువై ఉన్నారు. గ్రామదేవతలందరికి అక్కగా శ్రీ కనకదుర్గమ్మని భక్తులు విశ్వసిస్తుంటారు. పట్టణంలో అమ్మవార్లకు జరిగే ఉత్సవాల్లో ఒక విశిష్టత కనిపిస్తుంటుంది. ఉగాది పండుగ పురస్కరించుకుని పట్టణంలో శ్రీ ముఖధారమ్మ అమ్మవారి ఉత్సవాలు మొట్టమొదటిగా ప్రారంభం అవుతాయి. ఆ తరువాత 15 రోజులకు పౌర్ణమికి శ్రీ మావూరమ్మ వారి ఉత్సవాలు, ఆపై 15 రోజులకు అమావాస్యకు పెద్దింట్లమ్మవారు, ఆపై 15 రోజులకు పౌర్ణమికి గ్రామ దేవత శ్రీ మావుళ్లమ్మవారు ఉత్సవాలు పట్టణంలో ప్రధానంగా నిర్వహిస్తుంటారు. ఆపై మిగతా అమ్మవార్ల ఉత్సవాలను ఈ నలుగురు అమ్మవార్ల ఉత్సవాలు జరుగుతున్న సమయంలో ముహూర్తాలు పెట్టుకుని నిర్వహిస్తుంటామని మిగితా అమ్మవార్ల ఉత్సవ కమిటీల సభ్యులు చెబుతున్నారు. ఇక్కడ ఏ అమ్మవార్ల ఉత్సవాలు నిర్వహించినా ఆ సమయంలో పట్టణంలో ఉన్న అన్ని అమ్మవార్ల ఆలయాలకు చలివిడి, పానకాల కావిడి తీసుకువెళ్లి వాయినాలు సమర్పించి వస్తుంటారు.

**ఉత్సవాల నిర్వహణ ఇలా**

పట్టణంలోని 17వ వార్డులో బ్రితావిచెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖధారమ్మ అమ్మవారి ఉత్సవాలు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ రోజున ప్రారంభిస్తుంటారు. అలాగే స్థానిక ముచ్చర్లవారి పుంతలో కొలువై ఉన్న అమ్మవారు శ్రీ కొండాలమ్మ తల్లి ఉత్సవాలు ఉగాది పండుగ వెళ్లిన తరువాత వచ్చే మొదటి శనివారం ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. అమ్మవారి ఉత్సవాలు ఐదు రోజుల పాటు నిర్వహిస్తుంటారు. స్థానిక బంగారు వారి చెరువుగట్టున కొలువై ఉన్న శ్రీ మావూరమ్మ తల్లి ఉత్సవాలు చైత్రమాశంలో వచ్చే పౌర్ణమి నాడు ప్రారంభిస్తారు. ఈ ఉత్సవాల్లో ప్రతీ సంవత్సరం అమ్మవారికి లక్షమల్లెల పూజ చేస్తుంటారు. బోళ్లవారి వీధిలో కొలువై ఉన్న శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారి ఉత్సవాలు ప్రతీ సంవత్సరం వైశాఖ శుద్ధ అమావాస్యనాడు ప్రారంభిస్తుంటారు. స్థానిక పల్లపు వీధిలో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు వైశాఖ మాసంలో మహూర్తం చూసుకుని ఉత్సవాలు చేస్తుంటారు. అలాగే మావుళ్లమ్మ పేటలో కొలువై ఉన్న శ్రీ మావుళ్లమ్మ తల్లి ఉత్సవాలను వైశాఖ శుద్ధ పౌర్ణమి తరువాత వచ్చే శనివారం ఉత్సవాలు చేస్తుంటారు. షావుకారు పేటలో మావుళ్లమ్మ తల్లి కొలువై ఉంది. ఇక్కడ అమ్మవారి ఉత్సవాలు మే నెలాఖరున లేదా జూన్ మొదటి వారంలో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక లాకు సెంటర్ చింతల తోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మతల్లి పట్టణంలో అత్యంత వైభవంగా ఉత్సవాలు జరిగే అమ్మవార్లలో ప్రథమదేవత. ఈ అమ్మవారి ఉత్సవాలను మావుళ్లమ్మ ఉత్సవాలు అనంతరం వచ్చే సోమవారం నిర్వహిస్తుంటారు.

**దుర్గామల్లేశ్వరస్వామివార్ల కల్యాణం ప్రత్యేకం**

రామగుండం పార్కు సెంటర్లో కోర్టు, తహసీల్దార్ కార్యాలయాల మధ్యలో కొలువై ఉన్న శ్రీ పుంతలో ముసలమ్మ ఉత్సవాలు సంక్రాంతి పండుగ నాడు నిర్వహిస్తుంటారు. యడ్లబజారు సెంటర్లో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలు ప్రతి సంవత్సరం పాల్గుణ శుద్ధ దశమి నాడు ప్రారంభిస్తుంటారు. ఏకాదశినాడు దుర్గామల్లేశ్వరస్వామివార్ల దివ్య కల్యాణం చేస్తారు. స్థానిక లాకు సెంటర్ రెల్లిపేటలో కొలువై ఉన్న వడ్డి పోలమాంబ, కుంచమాంబల ఉత్సవాలు ఐదేళ్లకు ఒకసారి నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాలను సుమారు ఐదు వారాల పాటు నిర్వహిస్తుంటారు. రెల్లి కులస్థులు ఈ ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుపుతుంటారు.

### ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: పట్టణంలో రాజరాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో మలుపులో ఉన్న డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూతలు సవ్యంగా లేవు. సరిగ్గా మలుపులో గొయ్యి ఉండడంతో అటుగా వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. పలు సినిమాహాళ్లు, ఆసుపత్రులు ఇటువైపు ఉంటడంతో నిత్యం వందల మంది ఇటుగా ప్రయాణిస్తుంటారు. దీంతో వారంతా భయపడుతూ అడుగులు వేయాల్సిన పరిస్థితి. మునిసిపాలిటీ మాత్రం ఈ డ్రెయిన్ అభివృద్ధి విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. ఈ అంశంపై ఇప్పటికైనా దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### 98 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్ల సంఘ అధ్యక్షుడి మృతి



సుబ్బారాయుడు

పాలకొల్లు సెంట్రల్: ఏపీ 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్ల సుదీర్ఘ పోరాటంలో అలుపెరు గని పోరాటం చేసిన సంఘ అధ్యక్షు డు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు యర్రంశెట్టి సుబ్బారాయుడు(60) సోమవారం రాత్రి మృతి చెందారు. ఈయ నకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుబ్బారాయుడు 98 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్ల కోసం ఎంతో పోరాటం చేశారని పలువురు కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలో మంత్రి నిమ్మల రామానాయుడు, అంగర రామ్మోహన్‌రావు, యడ్ల మురళీకృష్ణ, మండెల పణి, విస్సుకోట వెంకటరమణ, బోణం నాగబాబు, జి.వీరాస్వామి తదితరులు ఉన్నారు.

### పేదలకు నిత్యావసరాల పంపిణీ

పెనుగొండ: ఆచంట మండలం పెదమల్లానికి చెందిన యడ్ల మారియ్య సహకారంతో మంగళవారం గ్రామంలో పేదలకు ఉచితంగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కస్టమ్స్ ఉద్యోగం చేస్తూ విశఖ పట్నంలో స్థిర పడిన యడ్ల మారియ్య సొంత గ్రామంపై మక్కువతో ప్రతి ఏటా గ్రామంలో పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తూ వస్తున్నారు. టి.రాంబాబు, అంజూరి శలాబందురాజు, విప్పర్తి ఆనందరాము, పుల్లెల్ల జానీ పాల్గొన్నారు.

# డ్రెయిన్ పనుల పరిశీలన



డ్రెయినేజీ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం:పట్టణంలో అవసరమైనచోట్ల డ్రెయినేజీ పూడికతీత పనులు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ పట్టణంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న డ్రెయినేజీ శుభ్రం చేసే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శానటరీ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా ప్రధాన డ్రెయిన్స్‌లో సిల్ట్ తీసే పనులు చేయాలి ఉందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని డ్రెయిన్స్‌ను శుభ్రం చేయాలని చెప్పారు. పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

**ఆవులు, దూడలను కట్టడి చేసుకోవాలి**

పట్టణంలో పలు వీధుల్లో తిరుగుతున్న ఆవులు, దూడలను యజమానులు కట్టడి చేసుకోవాలని కమిషనర్ సూచించారు. రోడ్లపై ఆవులు, గేదెలు, దూడలు తిరుగుతున్నాయని ఇబ్బందులు పడుతున్నామని ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఆవులు, దూడలు రోడ్లపై తిరిగితే వాటిని స్వాధీనం చేసుకుని అందుబాటులో ఉన్న గో-సంరక్షణ శాలలకు తరలిస్తామని అన్నారు. యజమానులకు అపరాధ రుసుములు విధిస్తామని హెచ్చరించారు.

### ఎట్టకేలకు వెలగలవారిపాలెం రోడ్డుకు మరమ్మతులు



జుత్తిగ - వెలగలవారిపాలెం రోడ్డులో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని జుత్తిగ-వెలగలవారిపాలెం రోడ్డుకు మంగళవారం మరమ్మతులు మొదలు పెట్టారు. సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు అంటూ హడావుడి చేసిన కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు మరమ్మతులను మాత్రం గాలికి వదిలేసింది. ఈ రోడ్డులో నిత్యం ప్రయాణించే ప్రజలతో పాటు గ్రామస్తుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ నేపథ్యంలో గతంలో ఈ రోడ్డు దుస్థితిపై సాక్షి పత్రికలో పలు కథనాలు వచ్చాయి. ఆ కథనాల నేపథ్యంలో రూ.10 లక్షలతో నత్తా రామేశ్వరం - మల్లిపూడి రోడ్డును, రూ.6 లక్షలతో జుత్తిగ - వెలగల వారి పాలెం రోడ్లను మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. గతంలో నత్తా రామేశ్వరం మల్లిపూడి రోడ్డును మరమ్మతులు చేశారు. అయితే చాలా కాలం జుత్తిగ-వెలగలవారిపాలెం రోడ్డు మరమ్మతులను అధికారులు పట్టించుకోలేదు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల పేరు మార్పు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్వాతంత్ర సమరయోధుడు, విద్యా దాత అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలగా నామకరణం చేశార. పాలకొల్లు పట్టణానికి విద్యాదాత అయిన అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి 1968లో ప్రభుత్వ కళాశాల నిమిత్తం డొనేషన్ ఇవ్వగా నాటి నుండి ఏఎస్ఎన్ఎం కళాశాలగా పిలవబడుతుంది. 1996లో ఇంటర్, డిగ్రీ కళాశాలలను విడదీయగా డిగ్రీ కళాశాలకు మాత్రమే అద్దేపల్లి సత్యనారాయణమూర్తి పేరున కొనసాగుతుంది. కానీ గత 29 ఏళ్లుగా జూనియర్ కళాశాలకు మాత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మాత్రమే కొనసాగుతూ వస్తుంది. అప్పటి నుంచి కళాశాల పేరు మార్పు కోసం కళాశాల అధ్యాపక బృందం ఎన్నో ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు. అయితే మార్చి 4న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలగా నామకరణం చేస్తున్నట్లు జీఓ వచ్చింది. జీవో వచ్చే సమయానికి ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయని అనంతరం పేపర్ వాల్యూషన్‌కు అధ్యాపకులు వెళ్లడం వల్ల పేరు వెల్లడించడం ఆలస్యమైనట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు. ఈ మమేరకు కళాశాల ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు మంత్రి నిమ్మల రామానాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

### అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెనుమంట్ర: పెనుమంట్ర ఐసీడీఎస్ పరిధిలోని 10 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎ.కృష్ణకుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీకార్యకర్త, 9 అంగన్‌వాడీ సహాయకుల పోస్టు లు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. ఆచంట నియోజకవర్గం పరిధిలోని మల్లెపూడి-2 అంగన్‌వాడీ కార్యకర్త ఒక్క పోస్టును ఓపెన్ క్యాటగిరీకి రిజర్వ్ చేయగా, 9 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులను8 పెనుమంట్ర-7 బీసీ-డీ, వెలగలవారిపాలెం-2 ఎస్సీ, వెలగలేరు-2 ఓపెన్, పెనుగొండ-13 బీసీ- బి, మల్లప్పదిబ్బ-ఎస్సీ, సిద్ధాంతం -6 ఎస్సీ, పద్మనాభుని చెరువు ( ఆచంట ) బిసి -బీ, నీరుల్లిపాలెం ( వల్లూరు) ఎస్సీ, మర్రి మూలలంక ( అయోధ్య లంక ) బీసీ-ఏ కేటగిరీలకు రిజర్వ్ చేసినట్లు ఆమె తెలిపారు. అన్ని పోస్టులకు కనీస విద్యార్హత పదో తరగతి చదివి ఉండాలని,1 జూలై 2025 నాటికి 21 ఏళ్ల నుండి 35 ఏళ్ల లోపు వయసు ఉన్న స్థానిక వివాహిత మహిళలు అర్హులన్నారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు పూర్తి చేసిన దరఖాస్తులను పెనుమంట్ర ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు.

### శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు



మంచినీటి చెరువుగట్టున ఉన్న భక్తాంజనేయస్వామి

యలమంచిలి: చైత్ర శుద్ధ విదియ సందర్భంగా స్థానిక మంచినీటి చెరువు గట్టున ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి మురళి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఆంజనేయస్వామికి వట్టి వేరు, బంతి, చామంతి పూలతో పుష్పాభిషేకాలు, తమలపాకులు, గంగ సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



# పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పాలకొల్లు సెంట్రల్: మావుళ్లమ్మపేటలో పోషణ్ పక్వాడా వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



పెనుగొండ: పోషణ్ పక్వాడాపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



యలమంచిలి: చించినాడ గర్భిణులతో మాట్లాడుతున్న మహ్మద్ హసీనా

పాలకొల్లు సెంట్రల్: పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా బాలింతలకు, గర్భిణులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక మావుళ్లమ్మపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రాధాన్యత గురించి వివరించారు. మాజీ కౌన్సిలర్ ధనాని సూర్యప్రకాష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లి తీసుకునే పౌష్టికాహారం వల్ల బిడ్డకు తల్లిపాలు ఎంతో బలాన్నిస్తాయన్నారు. అనంతరం తల్లులకు రాగిపిండిని అందజేశారు. పాలకొల్లు రూరల్ యాళ్లవాని గరువు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.మల్లేశ్వరి, పి.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

**యలమంచిలిలో..**

యలమంచిలి: మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా చెప్పారు. ఏడో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె చించినాడ గ్రామంలో గర్భిణులు, బాలింతలకు ఇళ్లకు వెళ్లి మాతృత్వ సమయంలో ఆహార అలవాట్లు గురించి వివరించారు. బాలికలు, గర్భిణులు రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగేలా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రజని, భారతి, జ్యోతి, సుజాత పాల్గొన్నారు.

**పెనుగొండలో..**

పెనుగొండ: చిన్నారులు, కిశోర్ బాలికలు, గర్భిణులు, బాలింతలు ప్రతి రోజూ ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని పెనుగొండ గ్రామ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి అన్నారు. మంగళవారం పెనుగొండ అంగ్‌నవాడీ కేంద్రం వద్ద పోషణ్ పక్వాడాపై అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు బి.సుజాత, సచివాలయ మహిళా పోలీసులు పి.సరస్వతి, కె.ప్రిస్కిల్లా, కె.ఉమ పాల్గొన్నారు.

**వడలిలో..**

వడలిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా మంగళవారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ ఎ.కృష్ణకుమారి మాట్లాడుతూ రక్తహీనత పాగొట్టి రోగ నిరోధక శక్తి పెంచడానికి పౌష్టికాహారం ఉపయోగపడుతుందన్నారు. సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, సూపర్‌వైజరు రూతికుమారి, విజయదుర్గ పాల్గొన్నారు.